నెరవేరిన సొంతింటి కల

- 21 మందికి పట్టాల పంపిణీ
- 25వ వార్డులో 1,568 మందికి మేలు
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: సొంతిల్లు లేని కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, టిడ్కో ఇళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తోందని జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం రెల్లి వీధి సచివాలయంలో నిర్వహించారు. 18 మందికి ఒక్క సెంటు స్థలం పట్టాలు, మరో ముగ్గురికి ఓటీఎస్ సేల్ డీడ్స్‌ను కార్పొరేటర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులందరికీ సొంతింటి స్థలం, టిడ్కో ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రూ.25 వేలు, రూ.1 లక్ష చొప్పున డబ్బులు కట్టించుకుని ఇళ్లు మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు.

ఆ డబ్బులను డీడీల రూపంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు తిరిగి అందించిందని తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి విలువైన సెంటు స్థలం పట్టాలు ఇచ్చిందని, అక్కడితో ఆగకుండా వారికిచ్చిన స్థలంపై పూర్తి హక్కులు లభించేలా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు.

కె.కె.రాజు కృషితో..

వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కృషితో 25వ వార్డులో ఇప్పటి వరకు 1,489 మందికి ఒక సెంటు స్థలాలు, 79 మందికి టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయని కార్పొరేటర్ గోవింద్ తెలిపారు. గత 24 ఏళ్లుగా బీటీఆర్ కాలనీలో స్కీమ్ ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ఓటీఎస్ కింద సేల్ డీడ్స్ అందించి సంపూర్ణ హక్కులు కల్పించామన్నారు. దీనివల్ల పిల్లల చదువులు, వివాహాలు, అత్యవసర వైద్య ఖర్చులకు ఇంటిపై బ్యాంకు రుణం తెచ్చుకునే వెసులుబాటు లభించిందని చెప్పారు. 24 ఏళ్లుగా ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్ జగన్ సర్కార్ సేల్ డీడ్స్ అందించిందని.. అటువంటి నాయకుడు మరోసారి ముఖ్యమంత్రి అయితే పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మేము శాంతిపురంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. నా భర్త ప్లంబర్‌గా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తామని రూ.25 వేలు కట్టించి ఇవ్వలేదు. చాలా సార్లు తిరిగాం. జగనన్న సీఎంగా వచ్చాక రూపాయి ఖర్చు లేకుండా, ఎక్కడికీ తిరగకుండా పద్మనాభంలో సెంటు స్థలం కేటాయిస్తూ పట్టా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– జి.ఉమామహేశ్వరి, శాంతిపురం

ఇంటి విలువ పెరిగింది



గత 24 ఏళ్లుగా బీటీఆర్ కాలనీలో స్కీం ఇంట్లో ఉంటున్నాం. అత్యవసరమైతే ఇంటిపై ఎవరూ అప్పు ఇచ్చేవారు కాదు. అధిక వడ్డీలకు అప్పు తెచ్చేవాడిని, చాలా ఇబ్బందులకు గురయ్యాం. జగనన్న ప్రభుత్వంలో ఓటీఎస్ కింద రూ.20 వేలు చెల్లించాను. పూర్తి హక్కులు కల్పిస్తూ సేల్ డీడ్ అందజేశారు. ఇంటి వేల్యూ పెరిగింది. ఇపుడు నాకు ఇంటిపై బ్యాంకు లోన్ ఇస్తుంది. అప్పు కోసం ఎవరి వద్దకూ వెళ్లనక్కరలేదు.

– తంగేటి అప్పారావు, బీటీఆర్ కాలనీ

చాలా సంతోషంగా ఉంది



బీటీఆర్ కాలనీలో స్కీం ఇంటిలో ఉంటున్నాను. సరైన హక్కు పత్రాలు లేక అవసరానికి అప్పు పుట్టక చాలా ఇబ్బంది పడ్డాం. జగన్ బాబు ముఖ్యమంత్రిగా వచ్చాక ఇపుడు పూర్తి హక్కు కలిస్తూ రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు ఇచ్చారు. ఇపుడు మా ఇంటి విలువ పెరిగింది, బ్యాంకు రుణం కూడా వస్తుందని చెబుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– ఎ.జగ్గమ్మ, బీటీఆర్ కాలనీ

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఈవో చంద్రకళ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఎంసీ హైస్కూల్ విద్యార్థులు

సీతమ్మధార: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీ అండ్ టీ కాలనీలోని ఎస్‌ఎంసీ హైస్కూల్‌లో ద్వారకా సర్కిల్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎ స్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రయాణ సమయంలో రక్షణ కోసం హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవింగ్‌లో సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. సీఐ ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదికి రోడ్డు ప్రమాదాల్లో 300 మంది చనిపోతున్నారన్నారు. వాహనాలను అతివేగంగా నడపరాదని, రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ వెలిగినప్పుడు వెళ్లాలని, జీబ్రా లైన్‌లో పాదచారులు నడవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయాలని, మైనర్లు వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు, ఆర్ఎస్ఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ సతీష్, హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు బెండి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించండి

జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశ్వనాథన్

డాబాగార్డెన్స్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు విశాఖ వేదికగా నిర్వహిస్తోందని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో క్రీడలకు సంబంధించి ఏర్పాటు చేసిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 13 వరకు జరిగే పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎందరో క్రీడాకారులు నగరానికి వస్తున్నందున వారికి స్వాగతం పలికే బోర్డులతోపాటు సదుపాయాలకు సంబంధించిన సూచిక బోర్డులు, హోర్డింగులు, బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, క్రీడాకారులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సదుపాయం తదితర వాటిని ఏర్పాటు చేయాలని, మహిళా క్రీడాకారులకు ఆంధ్రా యూనివర్సిటీ మహిళా హాస్టల్లో ఏర్పాటు చేసిన వసతుల్లో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడును ఆదేశించారు. పట్టణ ప్రణాళికాధికారి సురేష్ కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదో పట్టణ పీఎస్‌ను సందర్శించిన డీసీపీ-2



సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న డీసీపీ-2 సత్యనారాయణ

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం డీసీపీ-2 ఎం.సత్యనారాయణ సందర్శించారు. డీసీపీ-2గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఆయన స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు, ఎస్ఐలు షేక్ షమీర్, దివ్యభారతి, ఏఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

18న విద్యార్థులకు పోటీలు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 5వ తరగతి పిల్లలకు డ్రాయింగ్ పోటీలు, 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వేమన పద్యాలు, సుమతి పద్యాలు, ఇతర తెలుగు పద్యాల పఠనం పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు మురళీనగర్ వాకర్స్ పార్కులో నిర్వహించే ఈ పోటీలకు మురళీనగర్, మాధవధార పరిసరాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు.

అభాగ్యులకు ఆశ్రయం



అభాగ్యులను పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం: ఏయూటీడీ షెల్టర్‌లో వసతి పొందిన ముగ్గురు అభాగ్యులకు పెందుర్తి లయోలా హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. గతేడాది జూలై 17న కేజీహెచ్ సమీపంలో రోడ్డుపై దీన స్థితిలో ఉన్న సూర్యప్రకాష్ అనే 65 ఏళ్ల వృద్ధుడికి దిశ పోలీసులు రక్షణ కల్పించి ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగించారు. గతేడాది మార్చి 13న తక్కుస్ అనే 38 ఏళ్ల వ్యక్తిని ఏయూటీడీ సిబ్బంది గుర్తించి మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందజేశారు. అతడి ఆరోగ్యం మెరుగుపడటంతో షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న అక్కయ్యపాలెం వద్ద రామస్వామి అనే 70 ఏళ్ల వృద్ధుడిని ఫోర్త్‌టౌన్ పోలీసులు వసతి గృహంలో చేర్పించారు. వీరు ముగ్గురు కదల్లేని స్థితిలో ఉండటంతో వారిని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న మేడపాటి రవీంద్ర, షేక్ నూర్ బాషా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో పలు ప్రాంతాల్లో బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి షేక్ నూర్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథి బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ విశ్వకర్మ యోజన, ఇతర సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతా మోహనరావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు భారతి, జిల్లా కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్యశ్రీ’ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్



ఆరోగ్యశ్రీ కొత్త కార్డును అందజేస్తున్న రవికుమార్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో శుక్రవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ రూ.25 లక్షలకు పరిమితిని పెంచిన కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, 50వ వార్డు నాయకులు బగాది విజయ్, పి.సునీత, సనపల నారాయణ స్వామి, సనపల రమేష్, కె.రఘు, సరస, సుమతి, టి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

49వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సూచనల మేరకు వార్డులోని 285 సచివాలయం పరిధి ఎన్‌జీజీవోస్ కాలనీలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ పేదవాడి సంపూర్ణ ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. వలంటీర్ రాధ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



ఎన్జీజీవోస్ కాలనీ స్కూల్‌లో విద్యార్థినితో మాత్రలు మింగిస్తున్న గొండు సీతారామ్



చిన్నారితో మాత్రలు మింగిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



నక్కవానిపాలెం అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ మన్‌మోహన్

సీతంపేట: నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా శుక్రవారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ పిల్లల చేత మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రమైన చేతుల ద్వారా నులిపురుగుల గుడ్లు శరీరంలోకి ప్రవేశించి రక్తహీతనకు కారణమవుతాయన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్ర వేసుకున్నట్టయితే నులిపురుగుల నశించి రక్తహీతన బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీతమ్మధార మండల విద్యాధికారి డి.రామారావు, కె.ఎ.బాలామణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణకుమారి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, సచివాలయ హెల్త్ సెక్రటరీ ఎం.కమలమ్మ, ఆశా కార్యకర్త ఎం.డి.నజీమా పాల్గొన్నారు.

25వ వార్డులో..

జీవీఎంసీ 25వ వార్డు రెల్లి వీధి సచివాలయంలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు మధ్య గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగేలా హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు సానబోయిన సురేష్, బొమ్మాళి రవి, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

శుభ్రమైన నీరే తాగాలి

సీతమ్మధార: నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో రేసపువానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యుడు మన్‌మోహన్ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. నక్కవానిపాలెం ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ప్రయోజనం చేకూరాలంటే పిల్లలు, కిశోర బాలలకు డీవార్మింగ్ మాత్రలు వేయడం తప్పనిసరన్నారు. శుభ్రమైన నీరు తాగాలని, ఆహార పదార్థాలను కప్పి ఉంచాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదని, మరుగుదొడ్లను ఉపయోగించాలని సూచించారు. ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ సుభరత మణి, ఏఎన్ఎం, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ గౌరి పాల్గొన్నారు.

జీఆర్పీ అదుపులో గంజాయి నిందితుడు

18.5 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాయగడకు చెందిన సునంద అనే వ్యక్తి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని, 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతా సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



డీఆర్ఎం నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో భద్రతా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వేలోని వివిధ విభాగాల్లో భద్రతా ప్రాముఖ్యం గురించి వివరించారు. భద్రత అనేది కేవలం నియమాల సమాహారం మాత్రమే కాదని, జీవిత విధానమని పేర్కొన్నారు. తమ తమ విధుల్లో ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు, క్రమశిక్షణను పాటించడం తమ బాధ్యతగా పరిగణించాలని సూచించారు. భద్రతలో నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించిన పలువురికి ప్రశంసాపత్రాలను డీఆర్ఎం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహరాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, స్టేషన్ డైరెక్టర్ వెంకటపతిరాజు, ఆపరేషన్స్, సేఫ్టీ, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికం, కమర్షియల్ విభాగాల అధికారులు, సీనియర్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ కౌన్సెలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల గానావధానం రేపు

సీతమ్మధార: ఈ నెల 11న గాన గంధర్వుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని టీపీటీ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో సీతమ్మధార బృందావన్ పార్కులో ఘంటసాల ఆరాధకుల నేతృత్వంలో ఘంటసాల గానావధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ రహమతుల్లా తెలిపారు. ఘంటసాల పాటలతో వినూత్న కార్యక్రమం, లఘు నాటికలు జరుగుతాయన్నారు.

సీఏ, సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో రిసోరెన్స్ అద్భుత ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

విశాఖ సిటీ: ఐఐటీ, నీట్‌లోనే కాకుండా కామర్స్ విభాగంలో కూడా రిసోరెన్స్ విశాఖపట్నం అద్భుత ఘనత సాధించింది. సీఏ, సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో రిసోరెన్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సొంతం చేసుకున్నారు. సీఎంఏ ఫౌండేషన్‌లో 100 శాతం ఉత్తీర్ణత, సీఏ ఫౌండేషన్‌లో ఆల్ ఇండియా టాప్ 50లో ఒకరు, 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం అనుపమ, భరత్, ప్రిన్సిపాల్స్ క్రాంతి, రాజశేఖర్, కామర్స్ హెచ్‌వోడీ శ్రవణ్, ఇతర అధ్యాపక బృందం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఆల్ ఇండియా టాప్ 50లో ఉత్తీర్ణత సాధించిన బోలెం కార్తీక్ రిసోరెన్స్ విశాఖపట్నం విద్యాసంస్థకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపాడు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు స్నేహ, త్రివేణి, ఐశ్వర్య, లిఖిత, లలిత, రేణుకలు అధ్యాపకులను కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీవీ రాజు అండ్ కో అధినేతలు డి.వి.రాజు, ప్రియాంక విద్యార్థులను సన్మానించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



జక్కంపూడి జగదీశ్వరరావు మృతదేహం

సీతమ్మధార: మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రైల్వే న్యూకాలనీకి చెందిన జక్కంపూడి జగదీశ్వరరావు(52) అనే వ్యక్తి ఆటో నడుపుతుంటాడు. కొద్ది రోజుల కిందట అతడి కుమార్తె తేజస్విని కాకినాడలోని బంధువుల ఇంట్లో మేడ పైనుంచి జారి పడి ప్రమాదవశాత్తు మృతి చెందింది. అప్పటి నుంచి అతడు మనస్తాపానికి గురై ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీ ఉదయం జగదీశ్వరరావు భార్య విజయనగరంలోని బంధువుల వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని ఆ సమయంలో అతడు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. విజయనగరం నుంచి అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటికి తిరిగొచ్చిన భార్య తలుపులు తీయడానికి ప్రయత్నించగా.. తెరుచుకోలేదు. బంధువులకు విషయం చెప్పడంతో వారు వెంటనే తలుపులు విరగ్గొట్టి చూసేసరికి భర్త నోట్లో నురగలు రావడంతో వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి జగదీశ్వరరావు మృతి చెందాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ చరిత్రలో పీవీ స్థానం పదిలం

మహారాణిపేట: దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ముదావహమని భారత జాతి పునరుజ్జీశక్తి పుస్తక రచయిత భాగవతుల శంకర్ సీలు హర్షం వ్యక్తం చేశారు. 20వ శతాబ్దంలో జన్మించిన గొప్ప మేధావుల్లో పీవీ ఒకరని కొనియాడారు.

నేటి నుంచి దక్షిణ భారత హిందీ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు హయ్యర్ పరీక్షలతో పాటు వైవా జరుగ్గా ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. పూర్తి ఏర్పాట్లు చేసినట్టు హెచ్ఎం ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు.